# మీరా

*(చిన్నప్పటినుండియు తన జీవితమును కృష్ణున కర్పితము గావించి ప్రపంచమును రసహీనమని తలంచి చరించుటలో మీరా మహా త్యాగురాలు. సామాన్య మానవుల త్యాగమునకు కొన్ని కారణము లుండవచ్చును. అయితే రాజవంశమందు జన్మించి సర్వసౌఖ్యములతో తులతూగు బాలికకు త్యాగము కలుగుట ప్రశంసనీయము. ధన, భోగ, శృంగార, మోహము ఆమెకు యే కొసయందైననూ లేకపోయెను. కృష్ణుని తప్ప మరెవ్వరినీ ఆమె ప్రేమించెడిది కాదు. లోకమాయలకు లోబడలేదు. లోక ప్రేమలు అసలే తెలియవు. దైవప్రేమనే తన ప్రాణమని భావించి అనుభవించెడిది. లోకకామమున్న ఆత్మారాముడు లభించడను సత్యమును గుర్తెరిగిన సుగుణవంతురాలు. లోకమునకు వశమైన లోకేశుడు చిక్కడని లోకమును త్యజించి లోకేశుని వరించెను. అందువలననే ఆమె తరించెను.)*

**భారత**

'భా' అనగా జ్యోతిర్మయము, 'రత' అనగా అభిలషించటం. కనుక, జ్యోతిర్మయుడైన భగవంతుని అభిలషించటమే భారతీయుల ప్రధాన లక్ష్యం. అగ్నిలో బొగ్గును వేసి విసనకఱ్ఱతో విసిరితే బొగ్గుకూడా అగ్నిగా మారిపోతుంది. ప్రజ్ఞాస్వరూపుడు, జ్యోతిర్మయుడు అయిన దైవమే అగ్ని, అజ్ఞానాంధకారముతో కూడిన మానవుడే బొగ్గు. ఆ అగ్నికి ఈ బొగ్గును సమీపంగా చేర్చి సాధన అనే విసనకఱ్ఱతో విసిరితే ఈ బొగ్గుకూడా అగ్నిగా మారిపోతుంది. హృదయపూర్వకంగా మనం దైవనామస్మరణ చేస్తే ఎట్టి బాధలూ మనకు సంభవించవు. ఒకవేళ సంభవించినప్పటికీ వాటిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగే శక్తిసామర్థ్యాలను ఆ నామమే ప్రసాదిస్తుంది.

మీకందరికీ తెలుసు, మీరా పరమ భక్తురాలు. ఆమె లోకాభిమానాన్ని, దేహాభిమానాన్ని త్యజించి ఆనందముతో నిరంతరం కృష్ణలీలలను గానం చేస్తూ ఉండేది. మీరాను వివాహమాడిన కుమారభోజరాజు ఆమెకు అనేకరకములైన సదుపాయములు గావిస్తూ వచ్చాడు. కాని, బాబరువారి రాజ్యముపైన దండెత్తి నప్పుడు ఆ యుద్ధములోపల ఆమె పతియైన రాణాభోజరాజు మరణించాడు. అప్పుడు మీరా అనాథ అయిపోయింది. ఆమె మరిది రత్నసింహుడు రాజ్యానికి వచ్చాడు. కానీ, దేహాభిమాని, లోకాభిమానియైన ఆమె మరిదికి మీరా ప్రవర్తన నచ్చలేదు. మహారాజా భార్య నల్గురిలో పాటలు పాడుతూ తిరగటం రాజకుటుంబానికే అవమానమని భావించాడు. దైవాన్ని స్మరించటం అవమానమనీ, లోకాన్ని వరించటమే గౌరవమని విశ్వసించాడు.

**విరిగిన విషం**

ఆనాటి ఘోషాస్త్రీలకున్న నిబంధన ప్రకారం వారు మగవారిమధ్య స్వేచ్ఛగా పాడుకోటంగాని, తిరగటంగాని చేయకూడదు. అందులో మీరా మహారాణా భార్య. ఆ రాష్ట్రంలో రాణులు ఎప్పుడూ మగవారిమధ్య కలిసేవారు కాదు. కాని, మీరాకు ఎట్టి భేదమూ లేదు. ఆమె భావమేమిటి? 'ప్రకృతి అంతయూ స్త్రీయే, కృష్ణుడొక్కడే పురుషుడు. కాబట్టి, నేను స్త్రీలమధ్య ఉంటున్నానుకాని, పురుషులమధ్య లేను' అని భావించేది. ఈనాడు బుష్‌కోట్లు, ప్యాంట్లు వేసుకోటం వలన పురుషులనుకుంటున్నాము. కాని, అందరూ స్త్రీలే! ఎట్లా? ఇది ప్రకృతి. అనగా, ఇది స్త్రీ తత్త్వమే. ఈ విశ్వనాటక రంగంపై అందరూ అనేకరకములైన వేషాలను వేస్తున్నారు. ఇవన్నీ వేషాలే, మనస్తత్త్వం మాత్రం పురుషులకు స్త్రీలకు సమానమే. దుఃఖము వస్తే స్త్రీలు ఏడుస్తారు, పురుషులు ఏడుస్తారు. ఆకలైతే పురుషులు తింటారు, స్త్రీలు తింటారు. కోపం వస్తే పురుషులు కోప్పడతారు, స్త్రీలు కోప్పడతారు. కామ క్రోధ లోభ మోహ మద మత్సరములు కూడా యిరువురికీ సమానంగానే ఉంటున్నాయి. కనుక, మీరందరూ అబలలే! మీలో ఎట్టి బలమూ లేదు. కేవలం భుజబలము, బుద్ధిబలము అందరికీ సమానమే. కనుక, అందరూ స్త్రీలే. భగవంతుడొక్కనికే నిగ్రహశక్తి ఉన్నది.

కాబట్టి అతడొక్కడే పురుషుడు. ఇట్టి భావముతో మీరా ఎవరు వచ్చినా వారిమధ్య ఆనందంగా తిరుగుతూ తన్మయత్వంతో కృష్ణుని గానము చేస్తుండేది. అందుచేత మహారాణా మీరాపై ద్వేషాన్ని పెంచుకున్నాడు. కృష్ణభక్తి పేరుతో మీరా స్త్రీ పురుషుల భేదమును విస్మరించి తిరుగుతున్నదనే కోపంతో, ఒకనాడు ఆమెకు పాలలో కఠోరమైన విషమును కలిపి అందించాడు. అయితే మీరా తాను యేమి తిన్నా, ఏది త్రాగినా దానిని ముందుగా కృష్ణునికి అర్పించేది. 'సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావనతో ఆమె నిత్యకృత్యములను ఆచరిస్తూ ఉండేది. అందుచేత తన మరిది అందించిన పాలగిన్నెను కృష్ణవిగ్రహము ముందు పెట్టి హృదయపూర్వకంగా 'కృష్ణార్పణం' అన్నది. ఆ మాట కేవలం ఆమె పెదవులనుండి వచ్చినది కాదు. హృదయం నుండి ఆవిర్భవించినది. ఆమె ప్రార్థన విన్న తక్షణమే కృష్ణుడు విషమును తాను ఆరగించి ఆ పాలను దివ్యమైన అమృతంగా మార్చాడు. ఆ పాలను కృష్ణుని ప్రసాదంగా భావించి ఆమె ఆనందంగా త్రాగింది. మీరా మరణించిన వార్త యేనిముషంలో వస్తుందో అని ఆమె మరిది చాలా ఆసక్తితో, ఆతురతతో ఎదురు చూస్తున్నాడు. కానీ అనుకున్నది ఒకటి, జరిగినది మరొకటి! ఆ పాలలో కలిపిన విషం ఆమెపై యెట్టి ప్రభావమూ చూపలేదని తెలుసుకొని చాలా నిరాశ చెందాడు. ఆమె మరణించలేదు. కారణమేమిటి? ఆ విషం కూడా కృష్ణునికి అర్పితమైపోయింది. దానితో కృష్ణ విగ్రహం నీల వర్ణంగా మారిపోయింది. ఆమె త్రాగగా మిగిలిన కొద్దిపాటి పాలను తీసుకువెళ్లి పరీక్ష చేయించాడు. అందులో విషము లేదని తేలింది. మరి అతడు స్వయంగా కలిపిన విషం ఎక్కడికి పోయినట్లు? దానిని భగవంతుడు ఆరగించాడు. ఎందుకంటే దానిని భగవత్ప్రీత్యర్థం అర్పితం చేసింది మీరా. భగవత్ప్రీత్యర్థం దేనిని అర్పించినా అందులోని మాలిన్యాన్ని తొలగించి దానిని పవిత్రం గావిస్తాడు భగవంతుడు.

**అక్బర్ రాక**

కొంతకాలం తరువాత మహారాణాయొక్క పరమవిరోధియైన అక్బర్ చక్రవర్తి మీరా భక్తిప్రపత్తులను గూర్చి ఆనోట, ఈనోట విన్నాడు. ఎలాగైనా సరే ఆమె దర్శనం చేసుకోవాలని అతనిలో తీవ్రమైన వాంఛ కలిగింది. ఈ విషయాన్ని బీర్బల్‌కు చెప్పాడు. అతడు కూడా వెంట వస్తానన్నాడు. ఒకనాడు యిరువురూ మారువేషాలు ధరించి మీరా దర్శనార్థమై బయలుదేరారు. ఆ సమయంలో మీరా కృష్ణమందిరంలో భక్తిపారవశ్యంతో తన్మయురాలై గానం చేస్తున్నాది. ఆమె గానం విని అక్బర్ అలౌకికానందంలో మునిగిపోయి తనను తాను మరచిపోయాడు. బీర్బల్ అతని వీపు తట్టి హెచ్చరించేంత వరకు తానెవరో, ఎక్కడున్నాడో, ఏమి చేస్తున్నాడో అక్బర్‌కి స్మృతి రాలేదు. చిట్టచివరికి వెళ్ళిపోయేముందు అక్బర్ ఒక హారాన్ని పట్టుకొని మీరా వద్దకు వెళ్ళి, ' అమ్మా! ఈ హారాన్ని దయతో స్వీకరించి కృష్ణుని మెడలో వేయవలసింది' అని ప్రార్థించాడు. అప్పుడు మీరా, 'పరుల వస్తువులను నేను ముట్టను. ఈ హారాన్ని కృష్ణుని మెడలో వేయాలనుకుంటే మీరే లోపలికి వెళ్ళి వేయండి' అన్నది. కానీ కృష్ణుని దగ్గరకు పోవటానికి అక్బర్‌కు ధైర్యం చాలలేదు. 'అమ్మా! నన్ను క్షమించి మీరే ఈ మాలను తీసుకొని కృష్ణుని మెడలో వేయండి' అని మరొక్కమారు ప్రార్థించాడు. అక్బర్ ప్రార్థనను కాదనలేక మీరాఅతని చేతినుండి ఆ హారాన్ని అందుకొని కృష్ణుని మెడలో వేసింది. ఈదృశ్యాన్ని మహారాణా తమ్ముడు చూసాడు.

**రాణివాసంనుండి విముక్తి**

కుక్క చెప్పులను వెతుకుతుంది, దుష్టుడు తప్పులను వెతుకుతాడు. మహారాణా తమ్ముడు మీరాలో ఎప్పుడు ఏ తప్పు కనిపిస్తుందా అని నిరంతరమూ వెతుకుతూ వచ్చాడు. ఎప్పుడైతే మీరా అక్బర్ చేతినుండి ఆ హారమును అందుకోటం చూశాడో తక్షణమే మహారాణా వద్దకు వెళ్ళి ఆమెపై లేనిపోనివన్నీ కల్పించి చెప్పాడు. 'ఈ మీరా మన వంశ గౌరవాన్ని మట్టిపాలు చేస్తున్నది. మన కీర్తిప్రతిష్ఠలను మంటగలుపుతున్నది. ఇకపై ఈమెను మనదగ్గర పెట్టుకోటం మంచిది కాదు. తక్షణమే బయటికి పంపించు' అని వత్తిడి చేశాడు. అక్బర్ పేరు వింటూనే మహారాణాకూడా కోపోద్రిక్తుడయ్యాడు. తక్షణమే కృష్ణమందిరానికి వచ్చి, 'మీరా! ఇక నీవు బయటకి వెళ్ళు' అని ఆదేశించాడు. అతడలా ఎందుకు అంటున్నాడో ఆమెకు అర్థం కాలేదు. 'నేనున్నది కృష్ణుని కోసమే! కృష్ణుని వదలి నేనెక్కడికి

వెళ్ళగలను?' అని ఒక్క క్షణం యోచించింది. అంతమాత్రము ఆలస్యాన్ని కూడా భరించలేక మహారాణా ఆమె జుట్టు పట్టి బయటికి యీడ్చేశాడు. ఒక్కసారి ఆమెకు షాక్ మదిరి అయింది. ఏనాడు సంకల్పించనిది ఈనాడు సంభవించిందే అని. ఆ కష్టముకూడా ఆమెకు సుఖాన్నే అందించినది. బాహ్యమందిరము మహారాణా నిర్మించినది. రాళ్ళు, మట్టి, ఇసుకతో నిర్మించినది. ఇది ఏనాటికైనా అశాశ్వతమే. శాశ్వతమైనది నా హృదయమందిరమే. భయపడనక్కరేదు అనుకుంది. చలోరె మన్ గంగా జమునాతీర్. ఏది గంగ? ఏది యమున? మన నాసికములో కుడి ప్రక్క గాలిని 'ఇడ' అన్నారు. ఎడమ ప్రక్క గాలిని 'పింగళ' అన్నారు. ఇవే గంగాయమునలు. ఈ రెండింటి చేరికయే సుషుమ్నానాడి. అదే భ్రూమధ్యస్థానము. అట్టి గంగాయమునా తీరానికి వెళ్ళవలసిందిగా మనస్సుకు బోధించింది. ఓ మనసా! నీవు అక్కడా ఇక్కడా పోనక్కరలేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు రెండూ కూడ చేరే భ్రూమధ్యస్థానమునకు పో. నా భావం పరిశుద్ధమైనది. గంగ...పవిత్రమైన జలము! యమున...చల్లని జలము. చల్లదనము శాంతికి చిహ్నము, నిర్మలత్వము పవిత్రతకు చిహ్నము. కాబట్టి, ప్రశాంతమైన, పవిత్రమైన స్థానము భ్రూమధ్యస్థానము. అక్కడ నా కృష్ణుడు ఉన్నాడు. ఎట్లా ఉన్నాడు? 'మోరముకుట పీతాంబర శోభే కుండల రజత శరీర....చలోరె మన్ గంగా జమునా తీర్'. అక్కడ పోయి కూర్చో. కొన్ని కష్టాల సమయంలో ఈవిధమైన జ్ఞానముకూడా కలుగుతుంది.

తులసీదాసు ఆమె కాలంవాడే. దీనికి ముందు తులసీదాసుకు ఒక జాబు వ్రాసింది. 'గురూజీ! నాకు భగవంతుని చింతనలో అనేక అభ్యంతరాలు జరుగుతున్నాయి. భర్త తన స్వార్థం నిమిత్తమై అనేక హింసలు పెడుతున్నాడు. నేను ఉద్దేశపూర్వకంగా అతనికి ఏమాత్రమూ కష్టం కలిగించటం లేదు. నేను దైవాన్ని అనుసరిస్తున్నాను. అప్పుడప్పుడు పతి ఆజ్ఞను ధిక్కరిస్తున్నాను. ఇది తప్పా, రైటా?' అని. అప్పుడు తులసీదాసు ఈమెకొక జాబు వ్రాసాడు. 'మీరా! ప్రాకృతమైన సంబంధములో కొంతవరకు నడుచుకోవలసిందే. ప్రాకృత ధర్మాన్ని ఆచరించవలసినదే. భగవద్విషయంలో మాత్రమూ ఎవ్వరినీ లెక్కచేయనక్కరలేదు. తండ్రియైన హిరణ్యకశిపుడు కుమారుని అనేక రకములుగా హింసించాడు. ప్రహ్లాదుడు ఆ తండ్రినైనా విస్మరించాడుగానీ భగవంతుని విస్మరించలేదు. భగద్విషయంలో అడ్డు తగిలినప్పుడు నీవేమాత్రము లెక్కచేయవద్దు. సోదరుడైన రావణుడు భగద్విషయంలో అడ్డు తగలటంచేత అతనిని దూరం చేసుకున్నాడు విభీషణుడు. సోదరుడనే భావాన్నికూడా లెక్కచేయనక్కరలేదు. రాముని సన్నిధి చేరే నిమిత్తమై ప్రయత్నించే భరతుని కైక అనేక హింసలు పెట్టింది. అరణ్యానికి పోనక్కరలేదు. పట్టాభిషేకానికి సిద్ధం కమ్మన్నది. దైవాన్ని చేరటానికి అడ్డు తగిలిన తల్లిని విసర్జించాడు భరతుడు. దైవానికి అడ్డు తగిలినప్పుడు తల్లినైనా సరే విసర్జించు. వామనుడు వచ్చినప్పుడు బలిచక్రవర్తి అతనిని సంపూర్ణంగా అర్పితం గావించుకునే నిమిత్తమై సంసిద్ధంగా ఉండినప్పుడు శుక్రాచార్యుడు అనేక అడ్డులు చెప్పాడు. 'గురూజీ! సాక్షాత్ పరమాత్ముడే వచ్చి నన్నడుగుతున్నప్పుడు పరమాత్మునికివ్వక నేనెవరికివ్వాలి ఈ జీవితము? ఇంతకంటె నాకు అదృష్టమా? ఎవరినైనా భగవంచుడు చేయి చాచి అడుగుతాడా? నా దగ్గరకు వచ్చి 'భవతి బిక్షాందేహి' అన్నాడు. అతని చేయి క్రింద, నా చేయి పైన. ఆహా! ఎంత అదృష్టము నాది'. గురువైనా నాకక్కరలేదు. నా సర్వస్వమూ దైవానికి అర్పితము చేస్తానని బలిచక్రవర్తి అర్పితం చేశాడు. ఇక్కడ తల్లి, తండ్రి, గురువు, సోదరుడు నలుగురినీ విసర్జించారు భక్తి మార్గములో. మధ్యలో కట్టుకున్న భర్తదేమి లెక్క. భగవంతునికి అడ్డు వస్తే భర్తనైనా విసర్జించు'మని జవాబిచ్చాడు. దీని అంతరార్థము ఏమిటి? అందరికంటె భగవంతుడు మిన్న. భగవంతునికి మించినవారెవ్వరూ లేరు. తల్లి, తండ్రి, అక్కలు, చెల్లెండ్రు, భార్య, భర్త, సోదరుడు అందరూ మధ్యలో వచ్చినవారే. ఇవన్నీ కదలిపోయే మేఘాలు. పుట్టక పూర్వము, పుట్టిన తర్వాత, మరణించిన తర్వాత త్రికాలములందు మార్పుచెందనివాడు భగవంతుడే! అట్టి భగవంతుని నిత్యసత్యముగా విశ్వసించు. కనుక, నిత్యసత్యమైన భగవంతుని చెందుటకై అనిత్యము, అశాశ్వతమైన వ్యకులయొక్క ఆటంకములు యేమాత్రమూ మన్నించరాదు' అని తులసీదాసు సందేశాన్నందించాడు.

అదిచూచుకొని మీరా, 'నా హృదయమే నీ మందిరము కృష్ణా! కాబట్టి మనిరువురినీ ఎవ్వరూ విడదీయలేరు' అనుకొని 'చలోరే మన్ గంగా యమునా తీర్' అని పాడుకొంటూ బయలుదేరింది.

**నామం నా గతి**

మీరా కుంభవృష్టిని, పెనుగాలిని సైతం లెక్కచేయక వీథివీథిలోనూ భజన చేసుకుంటూ వెడుతుంటే స్త్రీలు, పురుషులు అనేకమంది ఆమెను అనుసరించారు. అలనాడు వాల్మీకి శిష్యులైన లవకుశులు కూడా రుద్రాక్షలు ధరించి తంబుర మీటుతూ వీథివీథిలోనూ గొంతెత్తి రామభజన చేస్తూ వచ్చారు. కానీ, ఈనాడు అనేకమంది భజన చేయాలన్నా, నగరసంకీర్తనకు పోవాలన్నా బిడియపడుతుంటారు. భగవన్నామం చెప్పటానికి బిడియమెందుకు? దేహము వచ్చినదే దైవనామ స్మరణకోసం. కనుకనే, మీరా, 'ఓ కృష్ణా! సంసారమనే సముద్రంలో ఎంతో లోతుకు వెళ్ళి, ఎంతో కష్టపడి అత్యంత విలువైన నామమనే ముత్యాన్ని సంపాదించాను. ఇంత కష్టపడి నేను సంపాదించుకున్న ఈ ముత్యం తిరిగి నా చేతినుండి జారిపోకుండా చూసుకో, ఇంక నాకు నీవు తప్ప మరొక గతి లేదు ఓ గిరిధారీ!' అని ప్రార్థించింది.

**దైవంలో లీనం**

ఎప్పుడైతే మహారాణా మీరాను వెళ్ళగొట్టి కృష్ణమందిరం యొక్క తలుపులను బిగించాడో అదే క్షణంలో అక్కడ ద్వారకలోనూ కృష్ణమందిరంయొక్క తలుపులు మూసుకుపోయాయి. ఎవరెంతగా ప్రార్థించినా, ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అవి తెరుచుకోలేదు. మహారాణా తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడి మీరాకు క్షమాపణ చెప్పుకోవాలని బయలుదేరాడు. మీరా ద్వారక చేరుకొని , 'గిరిధారీ, గిరిధారీ...' అని స్మరిస్తూ మందిర ద్వారాలను తన తలతో కొట్టింది. ఆ ద్వారాలు తెరుచుకోటం, మీరా ప్రాణాలు వదలటం రెండూ ఒకేతూరి జరిగిపోయాయి. కృష్ణుడు ప్రత్యక్షమై ఆమెను తనలో లీనం చేసుకున్నాడు. మీరా కొద్ది నిముషాలలో ప్రాణాలు వదులుతుందనగా మహారాణా పరుగెత్తుకొని వచ్చి, 'మీరా! తెలియక నీకు తీరని ద్రోహం చేశాను. నన్ను క్షమించు, క్షమించు, క్షమించు...' అంటూ పశ్చాత్తాపపడ్డాడు.